# మీ రహస్యం నాకు చెప్పరూ...

పంపు దగ్గర నీళ్ళు పట్టుకుని, భుజాన బిందె ఎత్తుకుంటూ ఎదురింటికేసి చూసింది వనజ. తలుపులు వేసి వున్నాయి. కానీ కిటికీ దగ్గర కూర్చుని ఇటే చూస్తున్న రెండు కళ్ళు కనబడ్డాయి. బిందె బరువుకి బుజం కలుక్కుమంటున్నది. అంచేత అట్టేసేపు అటు చూడక, లోపలికి వెళ్ళింది వనజ. మరో బిందె, మరో బక్కెట్టూ అలా పట్టుకుంటూ మధ్య మధ్యలో కిటికీ వెనుకనున్న మనిషి వంక చూడసాగింది.

తెల్లవారకుండా లేచినా ఇప్పటికింకా పనులు కాలేదు. ఇంట్లోవున్నవారు మరో ముగ్గురే అయినా, ముగ్గురూ మగ మహారాజులే. ఆయనా, ఇద్దరు కొడుకులున్నూ. వాళ్ళు లేవడం, పాలు కాఫీలు సేవించడం, పేచీలు పడడం, జుట్టు పట్టుకోవడం ఇవే ఇంతవరకు సరిపోయాయి. ఆయన గారంటేనో ఒకనాడు బద్ధకాగ్రేసరుల్లా పడుకుంటే పడుకోవడమే. కూర్చుంటే కూర్చోవడమే. పేపరు చదివితే చదవడమే. ఇంక మరోనాడు చిచ్చు బుడ్డిలాగ హడావిడి చేస్తారు. వీటితోటే టైము గడుస్తుంది. తీరుబాటుగా కూర్చుని వీధిలోకి చూడ్డానికి నాకు అసలు ఎన్నడైనా కుదురుతుందా?

ఎదురింటి అమ్మాయి కూడా వంటరిది కాదు. ఆమె భర్త, ఒక కొడుకు. ఎంత పని లేదనుకున్నా పంపు లోంచి నీళ్ళు పడుతున్న కాస్సేపైనా ఆ జలపాతం ముందు జపం చేయవద్దా? వాళ్ళింట్లో నీళ్ళు బ్రహ్మాండంగా వస్తాయేమో. పనిదాన్ని అడగాలి. ఆయనగారు సూటు, బూటు వేసి షోగ్గానే వుంటాడు. ఐతేనేం ఇంట్లో పనులన్నీ చేస్తాడు కాబోలు. లేకపోతే ఇంత తీరుబాటు ఎల్లా వుంటుంది?

ఇన్ని విధాల వనజ అనుకుంటూ బిందెలు, బక్కెట్లు నింపుతూ నిర్మొహమాటంగా కిటికీ వేపే చూస్తోంది. అంత సేపూ కిటికీలోని ఆ వనిత అల్లాకూర్చునే వుంది. ఇది ప్రొద్దుటి ఘట్టం.

ఆడవాళ్ళు... అందునా భర్త పిల్లలు గల యిల్లాలు మంచి పని టైములో కిటికీ దగ్గర కూర్చుని వీధుల్లో వచ్చి పోయే చోద్యాలు చూడ్డం అనేది చాలా గొప్ప చోద్యం.

మధ్యాహ్నం పూలవాడి కేక వినబడింది. వనజ నిద్రపోతున్నది కాస్తా, వాడు పోతాడేమోనని గబగబ తలుపు తీసుకుని గేటు దగ్గరకు వచ్చింది. ఎదురింటి దగ్గర వున్నాడు. ఆమె పూలు కొంటోంది. తెల్లని చీరె, తెల్ల జాకెట్టు, పైకి అందంగా చుట్టిన ముడి, ఎండలోని వేడి నంతా చల్లగా మారుస్తున్నట్లుంది ఆమె వేషం చూస్తుంటే. బూజు బారిన తన చీరె, మెడపైన, ముఖం పైన జిడ్డుగా అతుక్కున్న తన జుట్టు, తన ఆకారం చూసుకుంది వనజ. ఎదురుగా నిలబడ్డానికే సిగ్గేసి లోపలికి వెళ్ళింది. ఎదురింటామె ఇంట్లోకి వెళ్ళిందని చూశాక, తను బైటికి వచ్చి పూలు కొన్నది. ఇది మధ్యాహ్నం ఘట్టం.

వేసవి కాలం మధ్యాహ్నం పూట ఎంత అందమైన వాళ్లయినా, జిడ్డు ముఖాలుగా తయారుకాక మానరు. కానీ ఆమె కడిగిన ముత్యంలా వున్నది. ఎవరైనా యింటికి వస్తారని సింగారించుకుని కూర్చున్నదేమో యీ వేళ అనుకుంది వనజ.

వనజ సాయంత్రం మళ్ళీ నీళ్ళు పట్టుకుంటూంటే ఆమె తలుపు తెరచుకుని బయటికి వచ్చింది. ఆమెది అందమైన ఆకారం. లేత పసుపురంగు వాయిలు పెద్ద పెద్ద పూలు అద్దినది కట్టుకుంది. ఆ చీర మెత్తగా ఆమె వంటిని అదుముతున్నట్లుంది. ఆ లేతరంగు, మెడమీద కాంతిని పరుస్తోంది. చేతులు పైకెత్తి గుమ్మాన్ని పట్టుకుని ఆమె నిలబడితే, పూచిన తంగేడులా వుంది. కాస్సేపటికి ఆమె యింటికి తాళం వేసుకుని పిల్లవాడి చేయి పట్టుకుని మెల్లిగా రోడ్డుమీద నడుస్తూ బయలుదేరింది. రంగు బొమ్మల అడ్వర్టయిజుమంటు పత్రికలోంచి దిగివచ్చి నడుస్తున్నట్లుంది. ఆమె పెద్దగా సింగారించుకోలేదు. గొప్ప అందగత్తె కాదు. కానీ ఆ హొయలు పరిశుభ్రత, చీరె కదలికలో వెలువడుతున్నట్లున్న సుగంధ పవనాలు... వనజ కన్నార్పకుండా చూసింది.

ఆ బిందె లోపల పెట్టాక గబగబ స్నానం చేసింది వనజ. తెల్లని చీరె, సన్న ఎర్ర జరీ అంచుది కట్టుకుని, కాటుక దిద్దుకుని, ఎర్రని కుంకుమ పెట్టుకుని, ఇన్ని పూలు తురుముకుంది. పిల్లలు వచ్చి చూచి, "అమ్మా–ఆచ్చి పోదామా?" అని అడిగారు. "లేదు నాన్నా!" అంటే... "మరి చీరె ఎందుకు కట్టుకున్నావు?" అన్నారు.

"ఊరికెనే" అన్నది వనజ.

కొంచెం ప్రొద్దుపోయాక యింటికి వచ్చిన వనజ వాళ్ళ ఆయన కూడా, "ఎక్కడికేమిటి పెత్తనాలు వెళ్ళివచ్చావు?" అన్నాడు. ఆమె ముఖం ముడుచుకుని, "ఎక్కడికి లేదు. సాయంత్రం శుభ్రంగా బట్ట కట్టుకోకూడదా?" అన్నది.

"కాదులే. ప్రత్యేకం సింగారించుకుంటేనూ..." అని అతను అంటోంటే "నా సంతోషం కోసం నేనేదో చేసుకున్నాను" అన్నది.

ఎదురింటి వనిత రోజూ ఉదయం పూట.. ఖాళీగానే కూర్చుంటుంది కిటికీలో. మధ్యాహ్నమప్పుడు పోస్టు అందుకోవడానికి వచ్చినప్పుడైననా సరే మాయని చీరె, చెరగని తలతో కనబడుతుంది. ఇంక సాయంత్రాలైతే చెప్పనే అక్కరలేదు. రోజుకో బట్టల మిల్లు వాళ్ళు అందంగా షోకేసులలో బొమ్మలకి చీరె కట్టి వదిలినట్టు, కొడుకు, తను నడిచి పోతుంటారు. వనజకి కూడా ఆమెను చూసి, చూసి తన అలంకరణ మీద శ్రద్ధ ఎక్కువైంది. పిల్లల్ని ఎదురింటి పిల్లవాడిని పిల్చుకు రమ్మని పంపి అతనికీ, వీళ్ళకీ ఆటల్లో స్నేహం కలిపింది. ఆ పిల్లవాడిని అన్నీ అడగాలని.

ఆమె... ఎదురింటి ఆమెది, ఒకరికోసం చేసుకునే అలంకరణ కాదు అని తేలిపోయింది. అది ఒకనాటి ప్రత్యేకయత్నమూ కాదు. సహజంగానే అలా అందంగా పూల తీగలా పుట్టినట్లుందామె. మెల్లిగా స్నేహం కలుపుకుని, ..'ప్రొద్దున పని పాటలు ఎల్లాగవుతాయి? మీ యింట్లో నీళ్ళు పట్టుకోనఖ్ఖర్లేదా? పనులన్నీ మీ ఆయనే చేస్తారా? మధ్యహ్నం పూట కాస్సేపు నడుం వాల్చరా? సాయంత్రం వంటపని వుండదా? మీ చీరెలు ఎవరు వుతికి యిస్త్రీ చేస్తారు?" లాంటి ప్రశ్నలు ఎన్నో వేసి జవాబులు తెలుసుకోవాలని ఆలోచన చేసింది. ఏమిటో పట్టలేని కుతూహలం. ఆమె జీవితం చూస్తోంటే విపరీతమైన ఆకర్షణ.

ప్రొద్దున్న బుజాన బిందె ఎత్తుకుంటూ ఎదురింట్లోకి చూసిన వనజకి, బార్లా తెరిచిన తలుపులు కనబడ్డాయి. బండిలో సామాను వెళ్ళిపోయింది. రిక్షాలో ఫాను పెట్టుకుని పిల్లవాడు కూర్చున్నాడు. ఆయన యింట్లో యింకేవేవో సర్దిస్తున్నట్లున్నాడు.

వనజకి అకారణంగా ఒక కంగారు కలిగింది. "బాబూ ఎక్కడికి వెడుతున్నారు?" అన్నది.

"యింకో యింటికి"

"మీ అమ్మగారు ఏరీ?"

"రాత్రే వెళ్ళిపోయింది. అక్కడే పడుకుంది."

"అయ్యో! 'మాయని చెరగు, చెరగని సింగారం మీవి. వాటిరహస్యం ఏమిటో నాకు చెప్పండి' అని అడగకుండానే వెళ్ళిపోయిందామె, అయ్యో!"

ఆ సాయంత్రం ఆరున్నరకి వనజ వాళ్ళ ఆయన ఇంటికి వచ్చేటప్పటికి వనజగాని పిల్లలు గానీ రోజూ మల్లే టిప్‌టాప్‌గా తయారై లేరు.

"ఇదేమిటి? ఇల్లాగే వున్నారేం యింకా?" అన్నాడాయన.

వనజ విసుగ్గా, "ఏదో లెద్దురూ! ఇంట్లోవుండే వాళ్ళం. ఎల్లా వుంటేనేం?" అన్నది.